www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 24 నవంబర్ 2023

5

మిల్లెట్ బిస్కెట్ల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - చింతాకొమ్మదిన్నె

ఏరువాక కేంద్రం, ఊటుకూరు వారు అంతర్జాతీయ చిరుదాన్యపు విలువ జోడింపుపై రెండవ రోజు శిక్షణలో భాగంగా గురువారం జొన్న, సొద్ద, కొర్ర, రాగులతో బిస్కెట్‌ల తయారీ గురించి ప్రయోగాత్మక శిక్షణ తరగతులు నిర్వహించారు. తదుపరి డాక్టర్ టి.మురళీకృష్ణ, కో- ఆర్డినేటర్, ఏరువాక కేంద్రం వారు ఆరోగ్యవంతమైన జీవన విధానంలో చిరుధాన్యాల పాత్ర గురించి వివరించారు. కెవికె సమన్వయకర్త డాక్టర్ ఎ.వీరయ్య చిరుధాన్యపు పంటల సాగు ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో డిపిడి ఆత్మ, పద్మలత, విస్తరణ శాస్త్రవేత్త, రామలక్ష్మి దేవి, యువ రైతులు, మహిళా రైతులు,అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

వ్యాపారులదే రాజ్యం

చీనీ ధరల్లో ఇష్టానుసారంగా నిర్ణయం

దసరా తరువాత పెరిగిన ధరలు

మహారాష్ట్ర నుంచి కాయలు తెప్పించి అడ్డుకుంటున్న వ్యాపారులు

ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి- సింహాద్రిపురం

ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మంచి ధరలు వస్తాయని ఆశించిన నేపథ్యంలో మార్కెట్‌లో మాయాజాలం కారణంగా చీనీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో అత్యధికంగా పులివెందుల నియోజవర్గంలోనే చీనీ తోటలు విస్తారంగా సాగులో ఉన్నాయి. ముఖ్యంగా సింహాద్రిపురం, తొండూరు, లింగాల మండలాలలో దాదాపు 35 వేల ఎకరాలలో తోటలు సాగులో ఉన్నాయి. ఈ ప్రాంతంలో పండే చీనీ కాయలు అధిక రోజులు నిల్వ ఉండడంతో పాటు కాయలు నాణ్యత సైతం బాగా ఉంటాయి. దీంతో కడప జిల్లా ప్రాంతంలోని చీనీ కాయలకు బెంగళూరు, శివమొగ్గ, చెన్నై, కోయంబత్తూర్, విజయవాడ ఇతర రాష్ట్రాలలోని మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. స్థానికంగా ఉండే చీనీ తోటల వద్దనే వ్యాపారులు కొనుగోలు చేసి బెంగళూరు, చెన్నై లాంటి ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు.

రాలిన చీనీకాయలు

రైతులపై వ్యాపారస్తులదే పైచేయి...

చీనీ రైతులు తమ పంట ఉత్పత్తులను పండించినప్పటికీ వాటిని విక్రయించాలంటే వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది. ఇటీవల కాలంలో పులివెందులలో చీనీ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. వ్యాపారులు మాత్రం స్థానికంగా ఉండే వారు మాత్రమే ఇక్కడ మండీలు ఏర్పాటుచేసి కొనుగోలు చేస్తూ ఉన్నారు. ఈ విధంగా స్థానిక వ్యాపారులు కొనుగోలు చేయడంతో మంచి ధరలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రముఖ కంపెనీలు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

దసరా తర్వాత పెరిగిన ధరలు

దసరా పండుగ అనంతరం చీనీ ధరలు అమాంతంగా రూ 33 వేల నుంచి రూ 55 వేల వరకు పెరిగాయి. అయితే ఈ విధంగా ధరలు పెరగడంతో రైతులు ఒక దశలో సంతోషం వ్యక్తం చేశారు. మరింత ధరలు పెరుగుతాయని అనుకుంటున్న నేపథ్యంలో వ్యాపారులు మహారాష్ట్రకు వెళ్లి అక్కడినుంచి కాయలు కొనుగోలు చేసి బెంగళూరు మార్కెట్‌కు తరలించారు. దీంతో ధరలు పెరగకుండా వ్యాపారులే కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఇదే సమయంలో రూ 65 వేల నుంచి రూ 75వేల పలికిన చీనీ కాయలు ప్రస్తుతం రూ. 50 నుంచి రూ. 55 వేల లోపు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పులివెందుల మార్కెట్‌లో మాత్రం మూడు రోజుల నుంచి టన్నుకు 20 కిలోల తరుగు, 8 శాతం కమీషన్‌తో రూ 40వేల లోపు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. సీజన్ కాయలకు కాలం ముగిస్తున్నప్పటికీ ధరలు రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేల రాలుతున్న కాయలు ..

మంచి ధరలు ఆశించి నిలువ చేసిన రైతులకు నష్టం వాటిల్లుతోంది. కాయలకు కొమ్మ తెగులు రావడంతో చెట్టు పైన ఎండిపోయి రాలిపోతున్నాయి. దీంతో ఎకరాకు రెండు టన్నులు చొప్పున నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు.

ధరలు వస్తాయని ఆశించా..

మార్కెట్‌లో ఈ ఏడాది మంచి ధరలు వస్తాయని ఆశించి కాయలు నిల్వ చేశా. అయితే ధరలు మాత్రం టన్నుకు రూ.50 నుంచి రూ.55 వేల వరకు మాత్రమే ధరలు స్థానిక తోటల వద్ద వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈసారి ధరలు పెరగలేదు.

- మధుసూదన్‌రెడ్డి, రైతు, గురజాల.

ధర కోసం వేచి చూసినా..

ఈ ఏడాది ధర కోసం వేచి చూసినప్పటికీ ప్రయోజనం కనిపించడం లేదు. ధరలు పెరుగుతాయని ఆశించినప్పటికీ ప్రయోజనం కనిపించడం లేదు. కాయలు నిలువ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్ లాంటివి ఏర్పాటు చేయాలి. **-మురళి మోహన్, రైతు , గురజాల**

నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో అంగన్వాడీ, కార్మిక సంఘాల నాయకుల పిలుపు

ప్రజాశక్తి-కడప అర్బన్

అంగన్వాడీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిసెంబర్ 8న నిర్వహించే నిరవధిక సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ అంగన్వాడీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు టి. చెన్నమ్మ, ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఐఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షురాలు టి.గంగావతి ప్రసంగించారు. అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అంగన్వాడీ లందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచుతానన్నా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ నీటి మీద రాతలుగా మిగిలిపోయిందన్నారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి

రాష్ట్ర ప్రభుత్వం సెంటర్ల పర్యవేక్షణ పేరుతో ఫుడ్ కమిషనర్, ఎంఎస్‌కె, తహాశీల్దార్, ఎంపిడిఒ రాజకీయ నాయకులు ఇలా అనేకమంది విజిట్ల పేరుతో అవమానిస్తూ వేధింపులు గురి చేస్తున్నారన్నారు. సమ్మెకు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి మనోహర్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసి.బాదుల్లా, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి, సిఐటియు నగర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, 5వ జిల్లా కార్యదర్శి ఐ.ఎన్. సుబ్బమ్మ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సమావేశంలో సిఐటియు, సిఐటియుసి ఐఎఫ్ టియు అనుబంధ అంగన్వాడీ సంఘ నాయకులు లక్ష్మీదేవి, సుబ్బమ్మ, అంజలి, మేరీ, శాంతి, యశోద, లసన్న, వసుంధర, వరలక్ష్మి, అరుణ, విజయలక్ష్మి, విజయమ్మ, శ్రీదేవి, మంజుల, సరస్వతి, శోభ, నరసమ్మ, శివమ్మ , మల్లేశ్వరి, వాసంతి, విజయ్, కుమారి, నాగ తులసి, కులాయమ్మ, నాగమణి, ఓబులమ్మ, సుభద్ర పాల్గొన్నారు.

28న డిఇఒ అవినీతి ఆరోపణలపై విచారణ

- హాజరు కావాలంటూ నోటీసులు

ప్రజాశక్తి -కడప అర్బన్

జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డి ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ సర్వేపల్లి రాధాకృష్ణన్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్ఆర్‌టిఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.వెంకట గంగరాజు లోకాయుక్తకు చేసిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లోకాయుక్త స్పందించి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. దీంతో డిఇఒపై అవినీతి ఆరోపణలను విచారణ చేపట్టాలంటూ ఎపిఆర్ఇఐ రాష్ట్ర సెక్రటరీ ఆర్.నరసింహారావును విచారణాధికారిగా నియమించారు. ఈనెల 28న ఉదయం 11 గంటలకు గుంటూరు నగరం కొరిటేపాడులోని తమ కార్యాలయం లో తగిన సాక్ష్యాధారాలతో హాజరు కావాలని ఫిర్యాదుదారు ఎన్.వెంకట గంగరాజు నోటీసులు జారీ చేశారు.

కడప జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డి ఈ ఏడాది జూన్‌లో జరిగిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులలో నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడ్డారని గతంలో ఉపాధ్యాయ సంఘాలు, పలు విద్యార్థి సంఘాలు తీవ్ర ఆరోపణలు చేశాయి. ఆ మేరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేశాయి. ఫ్యాప్టో ఆధ్వర్యంలో అధికారులకు చేసిన ఫిర్యాదు పై రీజనల్ జాయింట్ డైరెక్టర్ (పాఠశాల విద్య) ఎం.వెంకటకృష్ణారెడ్డి విచారణ చేపట్టినా, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అధికారులకు నివేదిక సమర్పించలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతోపాటు జిల్లాలోని ఉపాధ్యాయులను ఇష్టారాజ్యంగా దూషించడం, అసభ్యంగా మాట్లాడటం వంటి ఘటనపై వీడియోలు వైరల్ కావడంతో పాటు, పలు పత్రికలలో కథనాలు కూడా వచ్చాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి కలెక్టర్ తో పాటు, రాష్ట్ర గవర్నర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో సర్వేపల్లి రాధాకృష్ణన్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.వెంకట గంగరాజు డిఇఒపై ఉన్న అవినీతి ఆరోపణలపై కర్నూల్ లోని లోకాయుక్తకు సెప్టెంబర్ 20న 25 అంశాలపై సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన లోకాయుక్త కేసు నంబర్ 1797/2023/ బి1 గా కేసు నమోదు చేసింది. అనంతరం ఫిర్యాదు పై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. వై.రాఘవరెడ్డి పై వచ్చిన అభియోగాలను పూర్తిస్థాయిలో విచారించి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈనెల 28న విచారణకు హాజరు కావాలంటూ ఫిర్యాదుదారుకు ఎపిఆర్ఇఐ సెక్రటరీ నోటీసులు జారీ చేశారు. త్వరలోఆర్‌జెడిగా ఉద్యోగోన్నతి పొందుతున్న డిఇఒకు లోకాయుక్త నోటీసులు జారీ చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

డిఇఒపై చర్యలు తీసుకునే వరకూ పోరాటం

విద్యాశాఖాఅధికారి వై.రాఘవరెడ్డి ఉపాధ్యాయ బదిలీలలో, ఉద్యోగోన్నతుల్లో ఇష్టారాజ్యంగా, యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారని సర్వేపల్లి రాధాకృష్ణ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.వెంకట గంగరాజు అన్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు. డిఇఒ అవినీతిపై చర్యలు తీసుకునే వరకు పోరాటాన్ని సాగిస్తానని తెలిపారు. ఇప్పటికే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించాను. పోరాటాన్ని ఆపేది లేదని పేర్కొన్నారు

జల్లులతోనే సరి!

బంగాళాఖాతంలో అల్పపీడనం

మూడ్రోజులుగా మారిన వాతావరణం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో జల్లులతో కూడిన వాతావరణం నెలకొంది. మూడ్రోజుల కిందట బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఫలితంగా వేడితో కూడిన వాతావరణ ప్రభావం కనుమరుగైంది. రబీలో పంటల సాగుకు పదును మేర వర్షపాతం నమోదు కోసం రైతాంగం నిరీక్షిస్తోంది. ఈ నెల ఒకటి నుంచి నేటి వరకు పదునుపాటి వర్షం కురిసిన దాఖలాల్లేవు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం నెలకొన్న నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. అల్పపీడన ప్రభావం జల్లులకే పరిమితం కావడం తీవ్ర నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. ఖరీఫ్ నుంచి వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలో 17 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొనడం తెలిసిందే. రబీలో వర్షాభావ పరిస్థితులను అధిగమించి ఆశావహరీతిలో పంటలు సాగు కావాలనే ఆశలు అడియాశలు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో పదునుపాటి వర్షపాతం నమోదైతే చాలుననే నిరీక్షణ ఫలించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. పదునుపాటి వర్షపాతం నమోదైతే వర్షాధార పంటలైన వేరుశనగ బుడ్డశనగ, మినుము, నువ్వులు సాగుకు అనువైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. జిల్లాలో 3,72,050 ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉండగా, 96,902 ఎకరాల్లోనే విత్తనం పడడం ఆందోళన కలిగిస్తోంది. మినుములు మినహా మిగిలిన పంటల సాగు 16 శాతాన్ని అధిగమించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మిగిలిన 2,75,148 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగుకు అవతల మిగిలి పోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. పదునుపాటి వర్షం కురిస్తే మోస్తరు విస్తీర్ణంలో పంటలు సాగుకు అవకాశం ఉందని చెప్పుకోవచ్చు.

పేదింటి ఆడపిల్లలకు పెళ్లికానుక : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్, మంత్రులు

పేదింటి ఆడపిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే అపురూపమైన గొప్ప కానుకలు వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలు అని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా పథకం నాల్గవ విడత ఆర్థిక సాయాన్ని.. తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ వీసి హాలు నుంచి కలెక్టర్‌తోపాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మంత్రి ఆది మూలపు సురేష్,ఎ మ్మెల్సీ రామ చంద్రయ్య, ఎమ్మెల్యేలు రవీంద్ర రెడ్డి, రఘురామ రెడ్డి, హజ్ హౌస్ చైర్మన్ గౌస్ లాజం, మైనారిటీ కార్పొరేషన్ సభ్యులు హిదాయతుల్లా, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి. శివ ప్రసాద్ రెడ్డి, పొల్యూషన్ బోర్డ్ సభ్యుడు పాకా సురేష్ హాజరయ్యారు.వ ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం ఈ పథకానికి సంబంధించి వైఎస్ఆర్ జిల్లాలో వివాహం చేసుకున్న అర్హులైన 478 జంటలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 3,95,10,000 లను మెగా చెక్కు రూపంలో కలెక్టర్ అతిథులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు, చదువును ప్రోత్సహించడం కోసం పదో తరగతి నిబంధనను అమలు చేస్తూ ఆడపిల్లల బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఏడాదిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ పథకానికి సంబంధించి అర్హులను ఎంపిక చేసి లబ్ధిదారులకు కళ్యాణమస్తు, షాదీ తోఫాలను పెళ్లి కుమార్తె తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఆయా సంక్షేమ శాఖల అధికారులు, లబ్ది పొందిన వధూవరులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కడప : జిల్లాలో ఈ నెల 24 నుంచి జనవరి 25 వరకు నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను చక్కటి ప్రణాళికతో విజయవంతం చేయాలని జెసి జి.గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం జడ్‌పి డిఆర్‌సి కాన్ఫరెన్స్ హాల్‌లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహణపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్ గా, 36 శాఖల జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. గ్రామ స్థాయిలో సర్పంచ్ అధ్యక్షుడుగా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రచార నిమిత్తం జిల్లాకు 5 వ్యాన్లు రానున్నాయన్నారు. పథకాల అమలు తీరును వీక్షించడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను ఒక ఉత్సవంలా నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో ఎల్‌డిఎం దుర్గ ప్రసాద్, ఇండస్ట్రీస్ జీఎం జయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, జిల్లా డిఎల్ పివోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

కాశినాయన : ఎపి మోడల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని ఎస్‌టియు జిల్లా కౌన్సిల్ సభ్యులు యు. సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌టియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లీషు విద్యాబోధన ఉండాలనే ఉద్దేశంతో ఎపి మోడల్ పాఠశాలలను 2012 సంవత్సరంలో ఏర్పాటు చేసిందన్నారు. అప్పటి నుంచి విద్యను బోధించే ఉపాధ్యాయులు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని కోరుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. టిజిటిలను పిజిటిలుగా అప్‌గ్రేడ్ చేయాలని పేర్కొన్నారు.

ప్రతి సామాజిక వర్గానికీ సమన్యాయం

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలో ప్రతి సామాజికవర్గానికీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పదవులను కల్పించి సమన్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే ఘనత దక్కుతుందని ఉప ముఖ్యమంత్రులు అంజాద్‌బాషా, నారాయణస్వామి, వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు అన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి సామాజిక వర్గానికి సమన్యాయం చేశారన్నారు. గురువారం కడప నగరంలో సామాజిక సాధికారత బస్సుయాత్ర సాగింది. అనంతరం సాయంత్రం ఏడు రోడ్ల సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వారు ప్రసంగించారు. జగన్మోహన్ రెడ్డి నాలుగున్నర సంవత్సరాల పాలనలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి , మైనార్టీలకు జరిగిన అభివృద్ధిని తెలిపేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సాధికారిత బస్సుయాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వంలో ఏ విధంగా సామాజిక న్యాయం జరిగిందో అందరూ చూస్తున్నారు అన్నారు. నామినేటెడ్, చట్ట సభల్లో మహిళలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి , మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించారన్నారు. .బావి తరాలకు, మంచి భవిష్యత్తు ఉండాలంటే ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకుందాం అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, మాజీ ఎంపీ బుట్టా రేణుక, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పోతుల సునీత సభను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా, పోతుల సునీతమ్మ, టీటీడీ పాలకమండలి సభ్యులు మాసీమ బాబు, సిద్దవటం యానాదయ్య, సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, కరీముల్లా, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, కడప నియోజకవర్గ యువ వైసీపీ నేత అహ్మద్ బాషా, డిప్యూటీ మేయర్లు ముంతాజ్ బేగం, నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వైసిపి నాయకులు, మహిళలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోటిరెడ్డి కళాశాలకు ఆనర్స్ డిగ్రీ మంజూరు

ప్రజాశక్తి-కడప అర్బన్

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో బిఎ ఆనర్స్ డిగ్రీ మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా తెలిపారు. గురువారం కళాశాలలో అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్టుకు సంబంధించి ఆనర్స్ డిగ్రీని కళాశాల విద్య కమిషనర్ మంజూరు చేశారని పేర్కొన్నారు. అర్థశాస్త్రం చదవడానికి ఆసక్తి గల విద్యార్థులకు బిఎ ఆనర్స్ డిగ్రీ ఒక గొప్ప అవకాశంగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ ఆనర్స్ డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదటి సంవత్సరంతో సమానమని, ఆనర్స్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ రెండవ సంవత్సరంలో చేరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కళాశాలలోని బిఎ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులంతా ఫోర్త్ ఇయర్ ఆనర్స్ డిగ్రీని ఒక గొప్ప అవకాశంగా ఎంపిక చేసుకుని చక్కగా ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి. విజయలక్ష్మి దేవి, అధ్యాపకులు డాక్టర్ గురు మోహన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై రాష్ట్ర స్థాయి సదస్సు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

ఆధునిక వ్యవసాయం సాంకేతికతలపై డిసెంబర్ 3 నుంచి 5 వరకు రాష్ట్రస్థాయి అగ్రిటెక్ సదస్సులు గుంటూరులోని లాం ఫారంలో నిర్వహిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఊటుకూరు కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న సదస్సులో దాదాపు 125 పైగా ప్రదర్శన స్టాల్స్, అతిథుల సందేశాలు రైతులు -పరిశ్రమల ప్రతినిధుల చర్చాగోష్టి, తదితర అంశాలపై ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు తదితర ప్రదర్శనలు నిర్వహిస్తారని, చిరుధాన్యాలతో తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచుతారని కడప జిల్లా ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ రమణ

విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

విధులు సక్రమంగా నిర్వహించని లైన్‌మెన్లపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఇ ఎస్. రమణ పేర్కొన్నారు. గురువారం పోరుమామిళ్ల సబ్ డివిజన్ పరిధిలోని పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల క్షేత్రస్థాయి అధికారులు సిబ్బందితో పట్టణంలోని సిసిఆర్ కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణం చాలా విలువైందని, ఒక ఇంటి పెద్దని కోల్పోతే ఆ కుటుంబ సభ్యులు పడే వేదన, ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపుతర,ని చెప్పారు. విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా కింద స్థాయి నుంచి పై స్థాయి అధికారి వరకు ప్రతి ఉద్యోగి పనిచేయాలన్నారు. ట్రాన్సఫార్మర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్వహణ చేయని లైన్మెన్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని తెలిసిం దన్నారు. ఏర్పాటు చేయడంలో భద్రత నియమాలు తీసుకుంటామని తెలియజేస్తూ ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కేటాయించిన ప్రదేశాల్లో నివాసాలు ఉండని ఉద్యోగులకు సంస్థ చెల్లిస్తున్న ఇంటి అద్దె భత్యం ఆపివేయాలని ఆదేశించారు. వినియోగదారుడు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు క్షేత్ర స్థాయిలోని సిబ్బంది, అధికారులు వారితో మమేకమై విద్యుత్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ అల్లుకున్న తీగలను తొలగించాలన్నారు. లైన్లకు అడ్డువచ్చిన చెట్ల కొమ్మలను కత్తిరించి అవసరమైన పనులు ముందస్తుగా చేసి అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయాలన్నారు. 4 మండలాల్లో రూ. 2.10 కోట్ల మేర బకాయిలున్నాయని చెప్పారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మైదుకూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమైక్య భావం ఉండాలి

కడప అర్బన్ : భారత జాతి ఎల్లప్పుడూ సమైక్య భావం ఉండాలని, జిల్లాలోని యువత సేవ భావం కలిగిఉండాని రాజంపేట స్పెషల్ జ్యూడిషయల్ మేజిస్ట్రేట్ పి. శంకర్ అన్నారు. గురువారం జెబివిఎస్ ప్రెసెర్వేర్ సేవ సమితి ఆధ్వర్యంలో తెలుగు గంగ కాలనీలో జాతీయ సమైక్యతపై నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన యువత సమిష్టిగా ఉండాలన్నారు . వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.అశోక్ మాట్లాడుతూ మన జాతి సమైక్యత అనేక దేశాలకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అశోక్, షేక్. అయిషా, ప్రియా, పి. చరణ్, షేక్. సోహెబ్, ఎస్. సల్మాన్, బి. లక్ష్మీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసులపై నిరాధార ఆరోపణలు తగవు : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ రాజకీయ నాయకుడు పోలీసులపై నిరాధార ఆరోపణలు చేయడం తగవని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ అన్నారు. గురువారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానులే అని పేర్కొన్నారు. ప్రజలు, సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు పని చేస్తారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి అరెస్టు చేసే క్రమంలో పోలీసులు చట్ట పరిధిలో విధులు నిర్వహించారని చెప్పారు. అరెస్టు చేసిన సమయం నుంచి కోర్టుకు హాజరు పరచడానికి పోలీసులకు 24 గంటల సమయం ఉన్నా కూడా లీగల్ ఫార్మాలిటీ పూర్తి చేసి వైద్య పరీక్షలు నిర్వహించి కేవలం మూడు గంటల్లోనే మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారని పేర్కొన్నారు. పోలీస్ అధికారులకు అలాంటి దురుద్దేశం ఉండి ఉంటే అరెస్టు చేసిన సమయం నుంచి 24 గంటలు అవకాశం ఉన్నప్పటికీ నిక్కచ్చిగా విధులు నిర్వహించాలని తెలిపారు. డిఎస్పి షరీఫ్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు సిఎం కావాలి

ప్రజాశక్తి -కడప అర్బన్

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు సిఎం కావాలని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవి రెడ్డి అన్నారు. గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ 3వ డివిజన్‌లోని వరదకాలనీలో ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. ఈ సందర్భంగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాస రెడ్డి, ఆర్ మాధవి రెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని తెలిపారు. జగన్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని చెప్పారు. కడప ఎమ్మెల్యేకు దాచుకోవడం, పంచుకోవడం తప్ప అభివృధి పై ధ్యాస లేదని విమర్శించారు. స్ట్రీట్ లైట్ ,రోడ్లు, డ్రెయినేజీ లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రజలు ఈ ప్రభుత్వంతో విసిగిపోయిమారని, మాకొద్దు జగన్ అంటున్నారని చెప్పారు. వైసిపి వారు ఎన్ని యాత్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థతిలో లేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు రామకృష్ణ,శ్రీను, సుబ్బయ్య, భాస్కర్, జిలానీ బాషా, శివారెడ్డి, సుబ్బారాయుడు, పవిత్ర, వర ప్రసాద్, సురేష్,రవి,కృష్ణ రెడ్డి, మోహన్ రెడ్డి, రెడ్డయ్య యాదవ్, ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోలాటం గురువుకు సన్మానం

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి శ్రీ కోదండరామ స్వామి కోలాటం భజన బృందం, సరస్వతీ పూజను రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత అయిన భజన పుల్లయ్య చేతుల మీదుగా, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం గురువు ప్రసాద్‌రావును అతిథులు శాలువతో సన్మానించారు. ఈ సందర్భగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ గ్రామాలలో కళాకారులను ఆదరించి అభిమానించి పోషించడం వల్ల జానపద కళలకు మనుగడ ఉంటుందని చెప్పారు. సంప్రదాయాల పద్ధతిలో చెక్కభజన కోలాటం, జడ కోలాటం లాంటి అనేక విన్యాసాలతో ప్రజలను ఆనందింప చేయడం కోసం గ్రామాలలో కోలాటం భజనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ పెద్ద టీచర్ రోసి, శ్రీరామ్‌రెడ్డి, గురువులు ఓబులేసయ్య, బాల గురయ్యా, కీబోర్డ్ టీచర్ రమణయ్య , కిరణ్, డోల్ రమణ, రిథంపాడ్, కృపా, సౌండ్ సిస్టం ప్రిపరేటర్ గురయ్యా, డప్పు సుధాకర్ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ ఓబులేసుకు అభినందనలు

ప్రజాశక్తి - ముద్దనూరు

విధుల పట్ల అంకిత భావంతో పోలీస్ శాఖకు, ప్రజలకు హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు (292)అందించిన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ సేవా పతకం అందించింది. స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో గురువారం అవార్డు గ్రహీత హెడ్ కానిస్టేబుల్ ఓబులేసును సిఐ నరేష్ బాబు అభినందించారు. విధుల్లో మంచి నడవడికతో అవార్డు అందుకోవడం అభినందనీయమని ఓబులేసు సేవలను సిఐ కొనియాడారు. సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఓబులేసును అభినందిస్తున్న సిఐ

వీధి కుక్కలు పట్టివేత

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కలను పంచాయతీ ఆధ్వర్యంలో పట్టేశారు. ఇటీవల కుక్కల కాటుకు పలువురు వృద్ధులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు గ్రామంలో ఉన్న కుక్కలను పట్టి వేయాలని కోరారు. ఆ మేరకు గురువారం వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న వీధి కుక్కలను పట్టి దూర ప్రాంతాలకు తరలించారు. పంచాయతీ అధికారులు వీధి కుక్కలను పట్టి వేయడంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చింతలమడుగుపల్లె, మదీనాపురం, పక్కీర్‌పల్లె, గండి రోడ్డు, నాలుగు రోడ్ల కూడలి, కడప రోడ్డు, శ్రీచైతన్య, పిరమిడ్ నగర్ ప్రాంతాల్లో ఉన్న వీధి కుక్కలను పట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి మాట్లాడుతూ కుక్కల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆదేశాల మేరకు గ్రామంలో ఉన్న కుక్కలను పట్టి వేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల కూడా కుక్కలను పట్టి దూర ప్రాంతంలో విడిచి పెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, పారిశుధ్య మేస్త్రీలు అల్లాబకష్, సిబ్బంది పాల్గొన్నారు.

సహాయ పరికరాలు మంజూరు : జడ్‌పిటిసి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులు 56మందికి సహాయ పరికరాలు మంజూరైనట్లు జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది సెప్టెంబర్‌లో వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో అలింకో ఢిల్లీ వైద్య నిపుణులచే 300 మంది విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల కోసం ఉచిత వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. వీరిలో 56మందికి రూ.3.50 లక్షల విలువ చేసే వీల్ ఛైర్స్, వాకింగ్ స్టిక్స్, స్మార్ట్ ఫోన్స్, వినికిడి యంత్రాలు, సిపి ఛైర్లకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 29న పులివెందులలోని అహోబిలపురం ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో విభిన్నప్రతిభావంతులకు సహాయ పరికరాలు ఎంపీ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన విభిన్నప్రతిభావంతులు తప్పక హాజరుకావాలని జడ్పీటీసీ కోరారు.

శ్రీగౌరీదేవి కార్తీక మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - వేంపల్లె

పట్టణంలో వెలసిన శ్రీగౌరీదేవి ఆలయంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో గురువారం కార్తీకమాసం మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయని బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కలావాయ్య, కళిక చంద్రశేఖర్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు గౌరీదేవి వివిధ దేవతా అవతారాల్లో దర్శనమిస్తారని తెలిపారు. అర్చకులు కంభంపాటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో గౌరీదేవికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించామన్నారు. ఉత్సవాల్లో ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేంపల్లె మండల ప్రజలు గౌరీదేవిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు.

మదురూలో ప్రారంభానికి ప్రభుత్వ భవనాలు సిద్ధం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని మదురూ గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు పంచాయతీరాజ్ ఎఇ ఈశ్వరయ్య తెలిపారు. సచివాలయ భవనం రూ.40 లక్షలు, వైయస్ఆర్ హెల్త్ క్లినిక్ రూ.20.80 లక్షలు, ఆర్‌బికె రూ.21.80 లక్షలతో నిర్మించామన్నారు. వీటిని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి త్వరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నూతన భవనాలు ప్రారంభిస్తే ప్రజలకు అందుబాటులోకి వస్తే సౌకర్యవంతంగా ఉంటాయని తెలిపారు.

క్రైం కార్నర్

ఆస్తి తగాదా విషయమై

అత్తను గొడ్డలితో నరికి చంపిన అల్లుడు

ప్రజాశక్తి - కలసపాడు

మండలంలోని గంగాయపల్లి గ్రామంలో బాలమ్మ అనే మహిళను తన అల్లుడు సునీల్ ఆస్తి తగాదాతో విషయమై మాటమాట పెరిగి గొడవ చోటు చేసుకుంది. కోపంతో తన చేతిలో ఉన్న గొడ్డలితో బాలమ్మను కొట్టగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తర లిం చారు. ఎస్ఐ నాగమురళి వివరాల మేరకు.. బాలమ్మ అనే మహిళకు ఇద్దరు కూ తుర్లు. వారికి వివాహాలు అయ్యాయి. ఒక అల్లుడు సునీల్ అప్పులు చేసుకొని వాటి ని తీర్చలేక, తమ అత్త పేరు మీద ఉన్న నాలుగెకరాల భూమిని తమ స్వాధీనం చేయమని అడిగాడు. ఇందుకు బాలమ్మ నిరాకరించడంతో ఈ సంఘటన జరిగింది.

పట్టపగలే ఇంట్లోకి చొరబడి దొంగతనం

- 14 తులాల బంగారు అపహరణ

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో పట్టపగలే ఇంట్లోకి చొరబడి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. 14 తులాల బంగారం తీసుకెళ్లినట్లు బాధితురాలు నాగ సుబ్బమ్మ వాపోయింది. గురువారం చైతన్య స్కూల్ సమీపంలో వైఎస్ఆర్ టీచర్ యూనియన్ నాయకుడు సింగారెడ్డి అమర్నాథ్‌రెడ్డి నివాసం ఉన్నాడు. ఇంట్లో అమర్నాథరెడ్డి తల్లి నాగసుబ్బమ్మ ఒంటరిగా ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ముఖాలకు మాస్కులు పెట్టుకొని చొరబడి నట్లు బాధితురాలు నాగసుబ్బమ్మ తెలిపింది. నాగ సుబ్బమ్మను కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, గాజులు లాక్కున్నారు. నాగసుబ్బమ్మ భోజనం చేసిందో లేదోనని అమర్నాథ్‌రెడ్డి బంధువులకు సమాచారమిచ్చారు. వారు వెళ్లి చూడగా విషయం తెలిసింది. వెంటనే అమర్నాథరెడ్డి ఇంటికి వచ్చి సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ఘటనాస్థలం చేరుకుని నాగసుబ్బమ్మతో వివరాలు సేకరించారు. ఈ సంఘటనలో మహిళలు కూడా ఉన్నట్లు పేర్కొంది.

నేడు శివ భక్తేంద్ర స్వామి ఆరాధన

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలో ఉన్న శ్రీశ్రీశ్రీ శివ భక్తేంద్ర స్వామి 28వ ఆరాధన మహోత్సవం శుక్రవారం ఘనంగా జరగనుంది. ఆ మేరకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజలు, చెక్క భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి పలు పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శివ భక్తేంద్ర స్వామికి పాలాభిషేకం చేయనున్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని మండల ప్రజలను నిర్వాహకులు కోరారు.

మార్కెట్‌కు స్థల కేటాయింపు ఏదీ?

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్‌కు స్థల కేటాయింపులు లేకపోవడంతో రైతులు, వ్యాపారులు నానా అవస్థలు పడుతున్నారు. మైదుకూరు మండల పరిధిలో టమోటా, పచ్చిమిర్చి ఇతర కూరగాయలు, ఆకుకూరల సాగును రైతులు అధికంగా చేపడతారు. వాటిని అమ్మడం కోసం మైదుకూరు, ప్రొద్దుటూరు పట్టణాలకు తరలిస్తారు. అయితే మైదుకూరులోని వనిపెంట రోడ్డులో ప్రస్తుతం మార్కెట్ ఉంది. మార్కెట్‌కు ప్రత్యేక స్థలం కేటాయింపు లేకపోవడంతో రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ మధ్యకాలంలో అంకాలమ్మ గుడి సమీపంలో అమ్మకాలు రైతులు చేపడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్‌కు ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేసి దుకాణాలను ఏర్పాటు చేస్తే అటు రైతులకు ఇటు వ్యాపారులకు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్‌కి గాని, వివిధ గ్రామాలకు వెళ్లే ఆటోలు నిలుపుకునే స్థలం పార్కు స్థలం ఎలాంటి ఏర్పాట్లు లేవు. ప్రజల మీద మాత్రం మున్సిపాలిటీ పన్ను అధికంగా వసూలు చేస్తోంది. నంద్యాల రోడ్డులో ఉన్న పశువుల సంతను బద్వేల్ రోడ్డులోని గగ్గితిప్ప వద్దకు మార్చి ఏడాది అవుతోంది. పాత సంత ప్రాంతంలో కూరగాయల మార్కెట్‌కు గదులను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు అమలులో విఫలమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా మున్సిపాలిటీ పరిధిలో అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రస్తుతం రోడ్డు పైన కొనసాగుతున్న కూరగాయల మార్కెట్

జగన్ పాలనలో ప్రొద్దుటూరుకు మహర్దశ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రొద్దుటూరుకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో నిర్మాణదశలో ఉన్న పలు అబివృద్ధి పనుల గురించి వివరిస్తూ.. గ్రామీణ ప్రాంతాల్లో త్వరలో మొదలుపెట్టనున్న రహదారుల పనుల గురించి తెలిపారు. రాజుపాలెం మండలం సోమాపురం గ్రామస్తులు తమ వ్యవసాయ పనులకు పోవాలంటే వాగు దాటి వెళ్లాల్సి ఉంటుందని, ప్రతి సంవత్సరం ఈ వాగులో నీరు వేగంగా ప్రవహిస్తుంటుందన్నారు. వాగు దాటి వెళ్లాలంటే మహిళా కూలీలు, మహిళా రైతులు తీవ్ర అసౌకార్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపించారన్నారు. సోమాపురం అర్కటవేముల రైతులతో మాట్లాడి భూమిని సేకరించి రూ.1.10కోట్ల అంచనా వ్యయంతో పనులు పూర్తి చేశామన్నారు. 40రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల వెనకవైపు నరహరిపురం రోడ్డు సమస్య పరిష్కరించామన్నారు. రూ.50లక్షలతో పనులు పూర్తి చేస్తామన్నారు. మీనాపురం మీదుగా కల్లూరు-చెన్నమరాజుపల్లె వరకు 16కిలోమీటర్ల మేర రోడ్డు పనులకు రూ.9.40కోట్లు, రాజుపాలెం మీదుగా చెన్నమరాజు పల్లె-గాదెగూడూరుకు రూ.6.12కోట్లు, పెన్నానది మీదుగా పొట్టిపాడు-కుమ్మరపల్లె వరకు 12కిలోమీటర్ల మేర రోడ్డు పనులకు రూ.4.10కోట్లు మంజూరు చేయించామని పేర్కొన్నారు. త్వరలో పనులు ప్రారంభి స్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 95కిలోమీటర్ల మేర రూ.43.45 కోట్లతో తారు రోడ్లు పట్టణ ప్రాంతంలో రూ.94కోట్లతో 657రోడ్డు కాలువల పనులు పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి బాగలేదని చెప్పడం టిడిపి నాయకులకు తగదని పేర్కొన్నారు. వారు ధృత రాష్ట్రుని పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. తానెప్పుడూ అభివృద్ధి, సంక్షేమంతోనే కనిపిస్తానన్నారు. గతంలో టిడిపి నాయకులు ఈ అభివృద్ధిని ఎందుకు చేయలేకపోయారని ఎమ్మెల్యే రాచమల్లు ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మిదేవి, కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి, ఇర్ఫాన్‌బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ ఉమాదేవి, నాయీ బ్రాహ్మణ జిల్లా అధ్యక్షులు గుర్రప్ప

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతుల సంక్షేమమే సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని నాయీ బ్రాహ్మణ జిల్లా ఆధ్యక్షులు గుర్రప్ప, ఎర్రగుంట్ల మార్కెట్ యార్డు కమిటీ చైర్ పర్సన్ ఉమాదేవి అన్నారు. 'ప్రజాశక్తి'తో వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిచ్చి రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలకు పథకాలను అందిస్తూ పారదర్శకంగా పాలన సాగిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వినూత్న రీతిలో పథకాలను అమలు చేసి ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలబెట్టారన్నారు. మళ్లీ జగనన్నే సిఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అన్ని విధాలా జగన్ ప్రజలకు చేరువై జనం మెచ్చిన పాలన సాగిస్తూ ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత కల్పించిందన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పడిన ప్రభుత్వమని జగన్ నిరూపించారన్నారు. రైతులు, నాయీ బ్రాహ్మణుల సంక్షేమాభివృద్ధికి నిరంతరం పాటుపడతామన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. సిఎం, ఎంపీ అవినాష్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో, గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. టిటిడి బోర్డు మెంబర్ సిద్ద వటం యానాదయ్య సహాయ సహకారాలతో నాయీ బ్రాహ్మణ సంఘం కుల స్తుల అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం మండలాల రైతులకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి పాటుపడతామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ఘన విజయం సాధించేలా కృషి చేస్తామన్నారు. ప్రజలు తమ అమూల్యమైన ఓటును వైసిపికి వేసి ముఖ్యమంత్రిగా జగనన్నను, ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డిని అత్యంత భారీ మెజారిటీతో గెలిపించాలని గుర్రప్ప, ఉమాదేవి కోరారు.

సచివాలయాల్లో స్టేషనరీ కొరత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని సచివాలయాల్లో స్టేషనరీ కొరత ఏర్పడింది. పట్టణంలో మొత్తం తొమ్మిది సచివాలయాలున్నాయి. ఏ సచివాలయంలో కూడా స్టేషనరీకి సంబంధించి పేపర్లు, బుక్స్, పెన్నులు వంటి పలు రకాల వస్తువులు లేకపోవడం గమనార్హం. ప్రతి రోజు సచివాలయాలకు తమ పనులు నిమిత్తం వచ్చే ప్రజలకు కనీసం రసీదులు ఇచ్చేందుకు కూడా పేపర్లు లేకపోవడం గమనార్హం. సచివాలయాలకు స్టేషనరీ అందించే దుకాణదారునికి ఏడాది నుండి దాదాపు రూ.1,20,000 వరకు బకాయిలు ఉండడంతో, సదరు దుకాణదారుడు సచివాలయాలకు అందించవలసిన స్టేషనరీని నిలుపుదల చేసినట్లు సమాచారం. సచివాలయాలకు మూడు నెలలు నుండి స్టేషనరీ కొరత ఉన్నట్లు సమాచారం. కొన్ని సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులే స్టేషనరీని కొంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. స్టేషనరీ కొరతపై నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్‌ను వివరణ కోరగా.. సదరు దుకాణదారునికి రావలసిన మొత్తానికి సంబంధించి బిల్లులను ప్రభుత్వానికి పంపామని, అవి రాలేదన్నారు. ఏ సచివాలయంలోనూ స్టేషనరీ కొరత లేదంటూనే ప్రభుత్వం ప్రతి సచివాలయానికి స్టేషనరీకి రూ.1000 అందించిందని తెలిపారు. ఆ నగదుతో అవసరమైన స్టేషనరీ తీసుకోవాలని చెప్పామన్నారు.

ఎర్రగుంట్ల నగర పంచాయతీ కార్యాలయం

క్షయవ్యాధి నివారణ మనందరి బాధ్యత

- ఆర్ఎంఒ డాక్టర్ ముక్తియార్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

క్షయ వ్యాధి నివారణ మనందరి బాధ్యత అని ఆర్ఎంఒ డాక్టర్ ముక్తియార్ పేర్కొన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి ముక్త్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో గురువారం పవర్ గ్రిడ్ సంస్థ చీఫ్ మేనేజర్ వెంకన్న వారి సౌజన్యంతో పులివెందుల ప్రాంత క్షయ వ్యాధి గ్రస్తులకు ప్రాంతీయ ఆసుపత్రిలో పౌష్టికాహార పంపిణీ చేపట్టారు. ఆర్ఎం డాక్టర్ ముక్తియార్, డాక్టర్ నవీన్, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ సుకన్య 150 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు రావడం, సాయంత్రం సమ యంలో చలితో కూడిన జ్వరం వస్తుండడం, ఆకలి లేక పోవడం, బరువు తగ్గడం, దగ్గు సమయంలో ఛాతిలో నొప్పి లాంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్షయ నివారణకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో క్షయ వ్యాధి సూపర్‌వైజర్ నాగుల నాయక్, భాగ్యలక్ష్మి, స్నేహిత అమృతహస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, క్షయ వ్యాధి సిబ్బంది ఓబులేసు, రాధాదేవి, కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, ఎస్‌టిఐ కౌన్సిలర్ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని పల్లవోలు గ్రామంలో ఉన్న కాశినాయన వృద్ధాశ్రమంలో గురువారం నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దువ్వూరు మండలం నాగాయపల్లె గ్రామానికి చెందిన బొమ్ము వెంకటేశ్వరరెడ్డి, నాగలక్ష్మి కుమారుడు బొమ్ము వెంకట రోహిత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి సహాయం అందించారు. కార్యక్రమంలో పిప్పళ్ళ బాలనాగిరెడ్డి, శ్రీను, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దాతలు

ప్రజా సేవకులకు మద్దతివ్వండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజాసేవకుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చూసి వారికి మద్దతివ్వాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా 4వ వార్డులో గురువారం సాయంత్రం కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాచమల్లు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నిర్ణయం జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పేద, మధ్య తరగతి కుటుంబికులకు సమస్యలొస్తాయన్నారు. ప్రొద్దుటూరు నియోజక వర్గంలోని మహిళలకు తమ ప్రభుత్వంలో రూ.1,314కోట్లు ఉచితంగా ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి 20లేదా 30 సీట్లు వస్తాయని, రాష్ట్రంలో రెండు కోట్ల మంది మహిళలున్నంతవరకు జగన్ గెలుపు తథ్యమని రాచమల్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మిదేవి, నాయకులు బాబు, కోనేటి సునంద, పోరెడ్డి నరసింహారెడ్డి, సానె ప్రతాపరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చాపాడు : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. మండల పరిధిలోని పెద్దగురువలూరు గ్రామంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సచివాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపిపి మాట్లాడుతూ పెద్దగురువలూరు సచివాలయ పరిధిలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.18కోట్లు వినియోగించారని తెలిపారు. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సర్పంచ్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధం రెడ్డి, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న సీయోనుపురం సచివాలయంలో గురువారం రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు కడియాల లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్ ఖాదర్‌బాషా, డేనియల్, రసూల్, వెంకటసుబ్బయ్య, అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ బ్యాటరీల ప్రసాద్, వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ యజమాని వీరారెడ్డి, రవి, శ్రీరాములు, సిద్దయ్య, సంపత్, ఫైర్ రామకృష్ణ, నాగరాజు, సచివాలయ ఉద్యోగులు వాలంటీర్లు పాల్గొన్నారు.

రక్తదాతలకు ధన్యవాదాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగులోని రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎం.శ్యాంసుందర్‌కు రక్తం ఎక్కించాల్సి రావడంతో వారు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావును ఫోన్ ద్వారా సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి ఎన్.ప్రభుకుమార్, డి.చైతన్యరెడ్డి అనే వ్యక్తులచే ఎ పాజిటివ్ రక్తం ఇప్పించారు. కార్యక్రమంలో చైర్మన్ లక్ష్మణ్‌రావు, రక్తదాతలకు ధన్నవాదాలు తెలిపారు.

రక్తమిస్తున్న దాతలు

పరిశోధనా రంగంలో విద్యార్థులు రాణించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పరిశోధనారంగంలో విద్యార్థులు రాణించేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలని అకడమిక్ ఆడిట్ కమిటీ సభ్యులు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం అకడమిక్ ఆడిట్ కమిటీ సభ్యులు సందర్శించారు. ఉన్నత విద్య శాఖ ఆదేశాల మేరకు కమిటీ సభ్యులు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ కిరణ్‌కుమార్ కళాశాల ఆయా విభాగాల రికార్డులను పరిశీలించారు. ఉన్నత విద్యారంగంలో ప్రామాణికమైన న్యాక్‌లో ఉత్తమ గ్రేడు సాధించడానికి గల అర్హతలను, కేటగిరీలకు చెందిన సూచనలు చేశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై విద్యా బోధనపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

O.S.No. 495/2022

షేక్ హాజీవల్లి, 5/0 కీ.శే.॥ షేక్ మహబూబ్ బాషా, వయస్సు 30 సం.. ముస్లిం, ప్రైవేటు ఉద్యోగి, R/O. D.NO. 7/629, డ్రైవర్ కొట్టాల, ప్రొద్దుటూరు-516360, కడప జిల్లా.
...వాది

Vs

వడ్డి గిరిధర్, S/o. రంగనాథ స్వామి, వయస్సు 34 సం॥ హిందూ, బిజినెస్, R/O, D.NO. 24-98-11, ఫ్లాట్ నం.1, దొరసానిపల్లె, గ్రామం, ప్రొద్దుటూరు నుండలం, కడప జిల్లా.
...ప్రతివాది

సమను

పై దావా యందు పై వాది దావా మొత్తం రాకోరి ప్రతివాది పైన దాఖలు చేసి ఉన్నారు. అట్టి దావా 07-12-2023 వ తేదిన ఉదయం 10:30 ని॥లకు పై కోర్టు యందు మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల హాజరు కావలెయును. లేని యెడల పేరోక్షమున తీర్మానించబడును.

వాయిదా: 07-12-2023

ఆర్. మారుతీ ప్రసాద్
అడ్వకేట్
ప్రొద్దటూరు.

మహారాజశ్రీ ప్రొద్దటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు

O.S.No. 65/2020

బి.కుమార్‌ఏ బి.సి. ఉత్తన్న, హిందు, వయస్సు 49 సం॥ R/o. 4-1268-A, బుర్ర సాధు మఠం, సూపర్ బజార్ వీధి, ప్రొద్దటూరు టౌన్ మరియు మండలం.
...వాది

Vs

1. షేక్ సుభహాని భాషా, S/o. ఖాదర్ బాషా, ముస్లిం, ట్రావెలింగ్ ఏజంట్, వయస్సు 40 సం॥ అమృతనగర్ విగ్రహం దగ్గర, ప్రొద్దటూరు మరియు మండలం
...ప్రతివాది 1

2. షేక్ హసీనా, W/o సుబానీ, బాషా, ముస్లిం, సౌదీ వెళ్ళి వచ్చిన మహిళ/గృహిణి, వయస్సు 30 సం॥,అమృత నగర్, వై.యస్. ఆర్ విగ్రహం దగ్గర, ప్రొద్దటూరు టౌన్ మరియు మండలం.
...ప్రతివాది 2
ప్రతివాదులు

సమన్

పై నంబరు దావా యందు వాది దావా మొత్తం రాకోరి ప్రతివాదులు అయిన మీ పైన దావా వేయడం జరిగినది. అట్టి దావా యందు ప్రతివాదులైన మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల 14-12-2023 వ తేదీన ఉదయం 10:30 ని॥లకు పైన తెలుపబడిన కోర్టు యందు హాజరు, కావలెయును. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

తేదీ : 14-12-2023 (వాయిదా)

ఆర్. ఎం.ప్రసాద్,
అడ్వకేట్
ప్రొద్దటూరు.

మహారాజశ్రీ ప్రొద్దటూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

O.S.No. 434/2021

1. మాడెం సుజాత, W/o కి॥శే॥ బాల ఓబులరెడ్డి, వయస్సు 31 సం॥, హిందు.
2. మాడెం లక్ష్మీ శృతి, D/o. కి॥శే॥ బాలఓబుల్ రెడ్డి, వయస్సు 15 సం॥, మైనరు, హిందు, రిప్రసెంటెడ్ బై మాడెం సుజాతీ, గార్డియను (తల్లి), పై ఇరువురి అడ్రస్-D.NO. 2/661-2, బాకరాపేట వీధి, ప్రొద్దుటూరు - 516360.
...వాదులు

Vs

D3) మాడెం టబులరెడ్డి, S/o చిన్న ఓబులరెడ్డి, వయస్సు 60 సం॥ హిందు, R/o- D.No. 26/922-1, మిట్టమడి వీధి ప్రొద్దటూరు-516360, కడప జిల్లా.
D4) మాటం నరసింహారెడ్డి, 3/0 చిన్న ఓబులరెడ్డి, వయస్సు 53 సం॥ హిందు, R/D, D.NO. 2/550, నెహ్రూనగర్, చిన్న చౌకు, కడప సిటి, కడప జిల్లా.
...ప్రతివాదులు 3&4

సమను

పై నంబరు దావాలో పై వాది ప్రతివాదులు అయిన (D3&D4) మీ పైన దావా షెడ్యూలు దాఖలా ఆస్తికి డిక్లరేషన్ కోరి, దాఖలు చేసి ఉన్నాడు. అట్టి దావా యందు 3,4 ప్రతివాదులు అయిన మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు యందు 29-11-2023 తేదీన ఉదయం 10:30 ని॥లకు హాజరు కావలయును. లేని యెడల పరోక్ష మున తీర్మానించబడును.

వాయిదా: 29-11-2023

ఆర్. మారుతీ ప్రసాద్
అడ్వకేట్
ప్రొద్దటూరు.

మహారాజశ్రీ ప్రొద్దటూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

I.A. NO. 848/2022
O.S NO. 495 2012

షేక్ హాజీవల్లి S/o. మహబూబ్ బాషా వయస్సు 30 సం॥, ముస్లిం ప్రైవేటు ఉద్యోగి, R/o. D.No.7/629, డ్రైవర్ కొట్టాల ప్రొద్దుటూరు, 516360, కడప జిల్లా.
...పిటిషనరు/ వాది

Vs

వద్ది గిరిధర్, S/o రంగనాధస్వామి, వయస్సు 34 సం.-హిందూ బిజినెస్, R/O. D.No.24-98-11,నం.FlotNo.1, దొరసానిపల్లి గ్రామం, ప్రొద్దుటూరు మండలం, కడప జిల్లా.
...రెస్పాండెంట్/ప్రతివాది

నోటీసు

పై నంబరు I.A.ని పై రెస్పాండెంట్స్ అయిన మీ పైన క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి అటాచ్‌మెంట్ కోరి I.A.ని దాఖలు చేసి ఉన్నారు. అట్టి పై పై I.A. నందు మీకు ఆక్షేపణలలు ఉన్న యెడల 09-12-2023వ తేదీన ఉదయం 10:30 ని॥లకు పై కోర్టు ఎదుట హాజరుకానలెయును. అట్లు లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా: 09-12-2023.

SCHEDULE

Site situated in YSR District, Proddatur Sub-district, Proddatur Mandal, Gopavaram Panchayat, Ward No.3, Korrapadu Road, K.S.R. Nagar, Krishna Block, Plot No.111 and 112, Proddatur Village fields,
Survey No. 183/A pyki Ac. 1-43 cents
Survey No. 184/A pyki Ac. 1-50 cents
Survey No. 186/A pyki Ac.10-58 cents
Total an extent of Ac.13-51 centa pyki Ac.0-06 cents and 886 square links or 0.027 hectors bounded as follows.
East: Site of Plot No. 109, 110, West: 25width layout road, North Lands of others, South: Site of Plot No.113.
Within the boundaries east-west 50 feet or 18.250 meters, north- south: 60 feet or 18.288 meters, with all easementary rights.
Market value of Rs.5,00,000-00

ఆర్. మారుతీ ప్రసాద్
అడ్వకేట్, ప్రొద్దటూరు.

మహారాజశ్రీ ప్రొద్దటూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

I.A.NO. 597/2021
O.S 434/2021

1. మాడెం సుజాత, W/o కి॥శే॥ బాల ఓబులరెడ్డి, వయస్సు 31సం॥, హిందు.
2. మాడెం లక్ష్మీ శృతి, D/o. కి॥శే॥ బాలఓబుల్ రెడ్డి, వయస్సు 15 సం॥, మైనరు, హిందు, రిప్రసెంటెడ్ బై మాడెం సుజాతీ, గార్డియను (తల్లి), పై ఇరువురి అడ్రస్-D.NO. 2/661-2, బాకరాపేట వీధి, ప్రొద్దుటూరు - 516360.
...పిటీషనర్లు/వాదులు

Vs

R3). మాడెం టబులరెడ్డి, S/o చిన్న ఓబులరెడ్డి, వయస్సు 60 సం॥ హిందు, R/o- D.No. 26/922-1, మిట్టమడి వీధి ప్రొద్దటూరు-516360, కడప జిల్లా.
R4) మాటం నరసింహారెడ్డి, 3/0 చిన్న ఓబులరెడ్డి, వయస్సు 53 సం॥ హిందు, R/D, D.NO. 2/550, నెహ్రూనగర్, చిన్న చౌకు, కడప సిటి, కడప జిల్లా.
...రెస్పాండెంట్లు/ప్రతివాదులు 3&4

నోటీసు

పై నంబరు I.A.ని పై పిటిషనర్లు పిటిషన్ షెడ్యూలు దాఖలా ఆస్తికి పర్మనెంట్ ఇంజక్షన్ కోరి మీ పైన దాఖలు చేసియున్నారు. అట్టి పై I.A. నందు, మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు యందు 29-11-2023 వ తేదీన ఉదయం 10:30 ని॥లకు హాజరు కావలెయును. లేని యెడల సరోక్షమున తీర్మానించబడును.

షెడ్యూల్

రేకుల వరండా ఇట్ల, D.NO.15/559, కడపజిల్లా, ప్రొదుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ప్రొద్దుటూరు సబ్-జిల్లా, ప్రొద్దటూరు మండలం, ప్రొద్దుటూరు టౌన్ పాండురంగ స్వామి గుడి వీధి, సర్వే నంబరు 357, మేడమీదిపల్లె గ్రామ పొలాలు : హద్దులు
తూర్పు : రాశి గోడ మరియు ఓబుల్ రెడ్డి ఇల్లు, పడమర : రస్తా, ఉత్తరం : సొంత గోడ మరియు టబులరెడ్డి స్థలం, దక్షిణం :సొంత గోడ, వారసందు తర్వాత ఇమాంచి ఇల్లు - తూర్పు- పడమర : 48 అడుగులు లేదా 14.640 మీటర్లు ఉత్తరం - దక్షిణం : 16½ అడుగులు లేదా 5.033 మీటర్లు (స్థలం) - ఇల్లు : తూర్పు-పడమర : 48 అడుగులు లేదా 14.640 మీటర్లు, ఉత్తరం - దక్షిణం: 14 అడుగులు లేదా 4.270 మీటర్లు. పూర్తి హక్కులు కలవు.

వాయిదా: 29-11-2023

ఆర్. మారుతీ ప్రసాద్
అడ్వకేట్, ప్రొద్దటూరు.